TGTEL/26/A6780
# స్పందన
తెలుగు దినపత్రిక
సంపుటి :01 | సంచిక :16 | పేజీలు 8 | వెల : 5
బుధవారం 30 సెప్టెంబర్ 2026



దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

## కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

రాజ్యాంగబద్ధ సంస్థలపై దాడులు చేయడం సరికాదని వ్యాఖ్య

వాస్తవాలను ప్రజల ముందుంచామని వెల్లడి

విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబర్ 29 : ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు అన్నారు. ప్రజల మద్దతు పొందడంలో విఫలమవుతున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, తరువాయి 2 వ పేజీలో...



## తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు
# చొరవ తీసుకోండి

కేంద్ర జల్ శక్తి మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి

తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులపై విస్తృత చర్చ

కృష్ణా, గోదావరి బేసిన్ అంశాల ప్రస్తావన

తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వ అనుమతులు త్వరగా లభించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన ముఖ్యమంత్రి, తెలంగాణకు సంబంధించిన కీలక నీటిపారుదల ప్రాజెక్టుల అంశాలను వివరించారు.



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే అందించినట్లు తెలిపారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని పూర్తి జలమట్టం 152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య తరువాయి 2 వ పేజీలో...



రాజ్యాంగ విలువల కోసం
## పోరాటం కొనసాగిస్తాం

దళిత, ఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో భట్టి విక్రమార్క

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్న కాంగ్రెస్

కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల వేదిక ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన దళిత-ఆదివాసీ ఆత్మగౌరవ సదస్సులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. సదస్సులో మాట్లాడిన భట్టి విక్రమార్క హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై జరిగిన ఘటనను ఖండించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీతో పాటు అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలపై ఆందోళన వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : సామాజిక న్యాయం కోసం స్వరం వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేయడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై నమోదవుతున్న కేసులు సంస్థాగత నిష్పక్షపాతతపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ పరిరక్షణ, సమానత్వం, తరువాయి 2 వ పేజీలో...



## పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన

ఏడాదిలోపే లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందిస్తామని హామీ

విలువైన ప్రభుత్వ భూముల్లోనే గృహ నిర్మాణం: పొంగులేటి

హైదరాబాద్, సెప్టెంబర్ 29: పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నాంపల్లి నియోజకవర్గ తరువాయి 2 వ పేజీలో...

## పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

జాతీయ రబీ సదస్సులో రాష్ట్ర ప్రగతిని వివరించిన తుమ్మల



పంటల వైవిధ్యీకరణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు గత ఏడాదితో పోలిస్తే 36 శాతం పెరిగి దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జాతీయ రబీ సదస్సులో పాల్గొన్న ఆయన తెలంగాణ వ్యవసాయ రంగంలో సాధిస్తున్న పురోగతి, రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29 : పంటల వైవిధ్యీకరణ, డిజిటల్ వ్యవసాయం, వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధి, రైతులకు రుణ సదుపాయాల విస్తరణ వంటి అంశాలను వివరించారు. వాతావరణ మార్పులు, ఎల్నినో ప్రభావం, వర్షపాతంలో అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. నీటి లభ్యత, స్థానిక పరిస్థితులకు తరువాయి 2 వ పేజీలో...



## ఆడోళ్లతో కొట్టిస్తా

ఇప్పటికైనా నోరు దగ్గర పెట్టుకోవాలి

కొండా సురేఖ మాస్ వార్నింగ్

ఊడిపోయే పదవుల్ల ఉన్నోళ్లు తమ ముందు కుప్పిగంతులేస్తే ఊకోమని.. వాళ్ల ను ఆడోళ్లతోటే కొట్టిస్తామని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మావోళ్ల మీద ఈగ వాలినా మంచిగుండదన్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 29: మిమ్మల్ని కొట్టనీకి మొగోళ్లే అవసరం లేదని.. నా ఎమ్మున్న ఆడోళ్లే సాలన్నారు. ఇప్పటికైనా నోరు దగ్గెర వెట్టుకోకుంటే ఎక్కడ దొర్కితే అక్కడ్నే కొడ్తారని హెచ్చరించారు. వరంగ ల్‌లో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్ల అన్ని స్థానాలల్ల గెల్వాలని సూచించారు. రెండ్రోజులైతే ఊశిపోయేటోళ్లు (ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు (కుడా చైర్మెన్ గుండు సుధారాణి) ఒకలున్నరు. నిన్నగాక మొన్న ఎక్కినోళ్లు తరువాయి 2 వ పేజీలో...



## ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు 1,941 కోట్ల ప్రాజెక్టులు

బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ ప్రారంభం

ప్రయాణ సమయం తగ్గి ట్రాఫిక్ సమస్యలకు ఉపశమనం

దేశ రాజధాని ఢిల్లీలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు సులభమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు రూ.1,941 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించారు. అలాగే మరికొన్ని కీలక రవాణా ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: ఈ ప్రాజెక్టులు ఢిల్లీ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రజల ప్రయాణాన్ని మరింత వేగవంతం చేయనున్నాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూ. 1,635 కోట్ల వ్యయంతో నిర్మించిన బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశను ప్రజలకు తరువాయి 2 వ పేజీలో...



# మండలంలో ప్రశాంతంగా నీట్ పరీక్ష

**న్యాల్కల్, స్పందన :**

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబివి, హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన నీట్ స్క్రీన్ టెస్ట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం 137 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఇందులో 107మంది పరీక్ష రాయగా మిగతా 30మంది గైర్హాజరు అయ్యారు. ఇందులో భాగంగానే ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తనిఖీ చేసి పరీక్ష రాసె విద్యార్థులకు.అన్ని సౌకర్యాలు చేశారా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీట్ పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రం వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏది ఏమైనప్పటికీ నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కలెక్టర్ వెంట జహీరాబాద్ ఆర్డిఓ దేవుజ, ఎం పి. ఓ ధనరాజ్ తదితరులు ఉన్నారు.



# ఫ్రైడ్ ఆసుపత్రిలో సీపీఆర్ పరికరాన్ని ప్రారంభించిన నిర్మలా జగ్గారెడ్డి

- సంగారెడ్డి పట్టణం లో నిర్మల జగ్గారెడ్డి పర్యటన

**సంగారెడ్డి, సెప్టెంబర్ 29(స్పందన)**

మాజీ డీసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మంగళవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన నేషనల్ అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించారు.జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ మీట్‌కు సంగారెడ్డి జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను ఆమె పరిశీలించారు. నవంబర్ 14, 16 తేదీల్లో జిల్లాలోని వోక్సెన్‌లో జరగనున్న పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

**ఫ్రైడ్ హాస్పిటల్‌లో ఆధునిక వైద్య పరికరాల ప్రారంభం**

అనంతరం సంగారెడ్డి పట్టణంలోని ఫ్రైడ్ హాస్పిటల్‌లో నూతన వైద్య పరికరాలను నిర్మల జగ్గారెడ్డి ప్రారంభించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఉపయోగపడే మెకానికల్ సీపీఆర్ పరికరాన్ని ఆమె ప్రారంభించారు. అలాగే గుండెలోని రక్తనాళాల్లో వాల్వ్ బ్లాకేజీ పరిమాణాన్ని గుర్తించేందుకు ఉపయోగపడే ఆధునిక వైద్య పరికరాన్ని కూడా ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఆధునిక వైద్య సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వేగంగా, మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జార్జ్ మాథ్యూస్, డాక్టర్ అనిల్,నాయకులు ప్రవీణ్, కూన వేణు,ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సోహైల్ అలీ, కార్యదర్శి జావిద్ అలీ, రవి, పీఈటీలు, పీడీలు తదితరులు పాల్గొన్నారు.

# దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించండి

**అసెంబ్లీ వద్ద ఘటనపై డీజీపీకి హైకోర్టు ఆదేశం**

హైదారాబాద్: తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని రాష్ట్ర డీజీపీని హైకోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆ అధికారుల వివరాలను సేకరించి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సమర్పించాలని డీజీపీ సీవీ ఆనంద్‌కు సూచించింది. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఈ ఘటన చోటుచేసుకుంది. నల్ల టీ–షర్టులు ధరించి నిరసన తెలిపేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, ఎమ్మెల్యేలకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది. ఈ ఘటనలో తమ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమర్యాదగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, బాధ్యులైన అధికారులపై అసెంబ్లీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు ఉంటుందని స్పష్టం చేసింది. ఒక మహిళా ఎమ్మెల్యే చీర లాగారని, మాజీ హోంమంత్రిగా పనిచేసిన మరో మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాసనసభ్యులను అసెంబ్లీలోకి వెళ్లకుండా నిలువరించే హక్కు పోలీసులకు లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తీసుకోవాల్సింది స్పీకర్ మాత్రమేనని సెప్టెంబర్ 8నే హైకోర్టు తేల్చి చెప్పిన విషయం విదితమే. మరోవైపు, ఈ ఘటనకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు సహా పలువురు ఎమ్మెల్యేలపై కేసులు నమోదయ్యాయి. అయితే, తాము ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసులు నమోదు చేయలేదని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ ఇప్పటికే జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌తో పాటు గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేసింది.

# పేదల సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

పరిధిలోని రెడ్ హిల్స్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పేదవాడు జీవితంలో ఒక్కసారైనా సొంత ఇంటిలో నివసించాలనే ఆకాంక్షను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి అన్నారు. నగర ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన వివిధ శాఖల భూములను గుర్తించి వాటిని గృహ నిర్మాణ శాఖకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. ఈ భూముల్లో బహుళ అంతస్తుల నివాస సముదాయాలను నిర్మించి పేద కుటుంబాలకు అందించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చడం కంటే పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడానికే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పారదర్శక ఎంపిక ప్రక్రియలో 480 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు మంత్రి వెల్లడించారు. మొదటి విడతలో అవకాశం రాని వారికి తదుపరి విడతల్లో ఇళ్లు కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. నగరంలోని పలు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ గృహ నిర్మాణానికి అవసరమైన భూములను గుర్తించామని, అనేక ప్రాంతాల్లో నిర్మాణ పనులకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. త్వరలోనే మరిన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.




ప్రస్తుతం నిర్మించనున్న ప్రతి నివాస గృహం విలువ సుమారు రూ. 80 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుందని మంత్రి తెలిపారు. రెండు లేదా మూడు సంవత్సరాలు కాకుండా కేవలం ఏడాదిలోపే నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గతంలో మాదిరిగా కేవలం పత్రాలు ఇచ్చి వదిలేయకుండా నేరుగా లబ్ధిదారుల పేర్లపైనే నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అదనపు భారం లేకుండా పూర్తి హక్కులతో ఇళ్లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ టవర్స్‌లో నివసించే కుటుంబాలకు భవిష్యత్తులో ఎలాంటి మౌలిక సదుపాయాల సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని మంత్రి వివరించారు. ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రధాన మార్గాలతో అనుసంధానం చేసి శాశ్వత పరిష్కారం కల్పిస్తామని తెలిపారు. నిర్మాణ పనుల నాణ్యతపై లబ్ధిదారులకే పర్యవేక్షణ అవకాశం కల్పిస్తామని, వారానికి ఒక రోజు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి తమ ఇల్లు ఎలా నిర్మితమవుతోందో స్వయంగా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. పేదలను నగరానికి దూరంగా తరలించి ఇళ్లు నిర్మించే విధానాన్ని ప్రజా ప్రభుత్వం అనుసరించడం లేదని మంత్రి స్పష్టం చేశారు. జీవనోపాధి, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే గృహ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి తండా, ప్రతి గూడెం, ప్రతి వార్డు, ప్రతి డివిజన్‌లో అర్హులైన పేదలకు ఇళ్లు నిర్మించి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పప్పుధాన్యాల సాగులో దేశంలో రెండో స్థానంలో తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే పప్పుధాన్యాల సాగు గణనీయంగా పెరిగి రాష్ట్రం జాతీయ స్థాయిలో ముందంజలో నిలిచిందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నేల సారాన్ని కాపాడడంలో కూడా పప్పుధాన్యాల సాగు కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో నెలకొన్న కరువు, లోటు వర్షపాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, జొన్న పంటలను ధరల మద్దతు పథకం పరిధిలోకి తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల వెల్లడించారు. అనేక మండలాలు తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నందున మండలాల వారీగా పరిస్థితులను అంచనా వేసి ప్రత్యేక కేంద్ర సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. సూక్ష్మ సాగునీటి ప్రాజెక్టులు, నీటి సంరక్షణ చర్యలు, రక్షిత సాగునీటి వ్యవస్థలకు అదనపు సహకారం అవసరమని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తరణలో తెలంగాణ రైతులు విశేష స్పందన చూపారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అదనంగా లక్షకు పైగా హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు విస్తరించిందని, వేలాది మంది రైతులు ఈ పంట సాగులోకి వచ్చారని వివరించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆయిల్‌పామ్ ధరల అంశాన్ని పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగంలో శాస్త్రీయ విధానాలను మరింత విస్తరించేందుకు తెలంగాణలో మట్టి ఆరోగ్య పరీక్షల లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు తుమ్మల తెలిపారు. ప్రస్తుతం ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు రాష్ట్ర అవసరాలకు సరిపోవడం లేదని, అదనంగా 16 కేంద్రాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం వేగంగా రైతులకు చేరాలంటే పరిశోధన, విస్తరణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొడంగల్‌లో అగ్రి వ్యాపార పార్కు, పొడి వాతావరణ ఉద్యాన పంటల కోసం అత్యుత్తమ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలను కేంద్రం సానుకూలంగా పరిశీలించాలని మంత్రి కోరారు. రైతులకు విత్తనాలు, ఎరువులు మాత్రమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నేల ఆరోగ్య సమాచారం, సకాలంలో రుణాలు, మార్కెట్ అవకాశాలు, నీటి పొదుపు పద్ధతులు కూడా అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ రంగ అభివృద్ధికి అవసరమైన ప్రత్యేక ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# ఢిల్లీ రవాణా సౌకర్యాల విస్తరణకు 1,941 కోట్ల ప్రాజెక్టులు

మొదటి పేజీ తరువాయి

అంకితం చేశారు. ఈ రహదారి అందుబాటులోకి రావడంతో తూర్పు ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ ప్రాంతాల మధ్య సిగ్నల్ రహిత రాకపోకలు సాధ్యమవుతాయని అధికారులు తెలిపారు. నగరంలోని ప్రధాన మార్గాలపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు వేలాది మంది ప్రయాణికులకు సమయం ఆదా కానుంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడిన అమిత్ షా, దేశవ్యాప్తంగా మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారులు, వంతెనలు, రైల్వేలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఢిల్లీ వంటి మహానగరాల్లో పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్యకు అనుగుణంగా ఆధునిక రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బరాపుల్లా ఎలివేటెడ్ రహదారి మూడో దశ పూర్తికావడంతో నగరంలోని పలు ప్రాంతాల మధ్య ప్రయాణ దూరం, సమయం గణనీయంగా తగ్గనుందని అధికారులు వివరించారు. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ప్రతిరోజూ ఎదుర్కొనే ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గే అవకాశం ఉందన్నారు. ఇంధన వినియోగం తగ్గడంతో పాటు వాయు కాలుష్యాన్ని కూడా నియంత్రించేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు.

అదనంగా మోదీ మిల్–సావిత్రి సినిమా ఫ్లైఓవర్, లోనీ అండర్‌పాస్ నిర్మాణ పనులకు అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత నగరంలోని రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తగ్గి రాకపోకలు మరింత సులభతరం కానున్నాయని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక రవాణా సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశ అభివృద్ధికి మౌలిక వసతుల నిర్మాణమే పునాదిగా నిలుస్తుందని అమిత్ షా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో రహదారులు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టులు ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయని ఆయన అన్నారు.



# తుమ్మిడిహట్టి బ్యారేజీ అనుమతులకు చొరవ తీసుకోండి

మొదటి పేజీ తరువాయి

త్వరగా అవగాహన కుదిరేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మాణం జరిగితే గ్రావిటీ విధానంలో నీటిని ఎల్లంపల్లికి తరలించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల విద్యుత్ వినియోగం, నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, సీతారామ సాగర్ బహుళార్థక ప్రాజెక్టు, గౌరవెల్లి రిజర్వాయర్‌కు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. అనుమతుల జాప్యం వల్ల ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని, అభివృద్ధి పనులు ఆలస్యమవుతున్నాయని వివరించారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను కూడా త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు సమగ్ర నివేదికను ఇప్పటికే సమర్పించినట్లు పేర్కొంటూ, నీటిపారుదల ప్రణాళికలు అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన ఆమోదాలు త్వరగా ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నట్లు తెలిపారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సిన టెలీమెట్రీ వ్యవస్థలను వేగవంతం చేయాలని కూడా ముఖ్యమంత్రి కోరారు. తొలి దశ టెలీమెట్రీ పరికరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండో, మూడో దశల పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ కాకా వంశీ గడ్డం, రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో సాగునీటి వనరుల విస్తరణ, ప్రాజెక్టుల పూర్తి కోసం కేంద్రం సానుకూల సహకారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

# రాజ్యాంగ విలువల కోసం పోరాటం కొనసాగిస్తాం

మొదటి పేజీ తరువాయి

సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల గౌరవం, హక్కుల రక్షణ కోసం పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

దేశ నిర్మాణంలో అణగారిన వర్గాలకు సముచిత స్థానం కల్పించాలన్నదే కాంగ్రెస్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జరిగే అన్యాయాలపై ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సదస్సుకు వివిధ రాష్ట్రాల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ వర్గాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరై సామాజిక న్యాయం, సమాన హక్కుల అంశాలపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

# ఆడోళ్లతో కొట్టిస్తా

మొదటి పేజీ తరువాయి

అసలైనోళ్లా.. లేక డూప్లికేటా మీరే ఆలోచించుకోర్రి. ఇంకోసారి మా ముందు కుప్పిగంతులేస్తే ఊరుకునేది లేదు. మిమ్ములను కొట్టనీకి మొగోళ్లు అవస రంలే.. ఆడోళ్లే కొడుతరు. నా ఎన్క నిలవడ్డోళ్లే సాలు.. ఒక్కొక్కళ్లు నలుగుర్ని కొడ్తరు. అంత దమ్ము, ధైర్యమున్నోళ్లు ఉన్నరు. నోరు జారీ పుసుక్కున ఎవర్నన్నా అంటే మాత్రం ఎక్కడ దొర్కితే అక్కడ్నే చిత్తు చిత్తు కొట్టి ఒదిలిపెడ్తరు. ఇప్పటికైనా నోరు దగ్గెరవెట్టుకొని ఉండుర్రి. ఇకముందు కొండా దంపతులకు చెందిన వ్యక్తుల మీద ఈగ వాలినా ఊరుకునేది లేదు' అని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ ఆరోపణలు నిరాధారం

మొదటి పేజీ తరువాయి

భారత ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో భారతదేశం అనుసరిస్తున్న విధానాలను అనేక దేశాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో ఎన్నికల ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదన్నారు.

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజల్లో అపోహలు వ్యాప్తి చేస్తున్నారని రామచందర్ రావు ఆరోపించారు. దీనికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుంచామని, తప్పుడు ప్రచారాలను ఖండించామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల అమలుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీసే విధంగా రాజకీయ ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడం అన్ని రాజకీయ పార్టీల బాధ్యత అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే చట్టబద్ధ మార్గాల్లో ప్రస్తావించాలని సూచించారు.

ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాల కంటే వాస్తవాల ఆధారంగా రాజకీయ చర్చలు జరగాలని రామచందర్ రావు అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలబెట్టడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై ప్రజలకు సరైన సమాచారం అందించేందుకు బీజేపీ కృషి చేస్తుందని రామచందర్ రావు తెలిపారు.

స్పందన
తెలుగు దినపత్రిక

# క్రీడా పోటీల విజేతలను సత్కరించిన గీతం





పటాన్ చెరు, సెప్టెంబర్ 29, (స్పందన):

క్రీడా, సాంస్కృతిక పోటీల విజేతలుగా నిలిచిన విద్యార్థులను మంగళవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాదులో సత్కరించారు. ఇదే స్ఫూర్తిని మున్ముందూ కొనసాగించి, విశ్వవిద్యాలయానికి మంచి పేరు తేవాలని వారిని ప్రోత్సహించారు. గీతం విశాఖపట్నం ప్రాంగణంలో సెప్టెంబర్ 26-27 తేదీలలో నిర్వహించిన ప్రతిష్టాత్మక డాక్టర్ ఎం.వి.వి.ఎస్. మూర్తి మెమోరియల్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో గీతం హైదరాబాదులో విద్యార్థులు సత్తా చాటారు. విజేతలందరినీ గీతం నాయకత్వం సత్కరించి, వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. గీతం క్యాంపస్ లైఫ్, క్రీడా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో గీతం విశాఖపట్నం, హైదరాబాదు, బెంగళూరు ప్రాంగణాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సుమారు 555 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, బాస్కెట్ బాల్, క్రికెట్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్ బాల్, అథ్లెటిక్స్, అలాగే శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యం, స్కిట్లు, సంగీతం వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పోటీపడ్డారు. అథ్లెటిక్స్ లో గీతం హైదరాబాదు విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. పురుషుల జట్టు 200మీ, 1500మీ పరుగు పందాలు, 4ఇ100మీ రిలే, షాట్ పుట్ లో స్వర్ణ పతకాలతో పాటు, 100మీ స్ప్రింట్, షాట్ పుట్, డిస్కస్ త్రోలలో కాంస్య పతకాలతో సహా మొత్తం ఏడు పతకాలను కైవసం చేసుకుంది. మహిళల జట్టు 100మీ, 200మీ, 1500మీ పరుగు పందాలు, 4ఇ100మీ రిలేలలో స్వర్ణ పతకాలతో పాటు స్ప్రింట్, షాట్ పుట్, డిస్కస్ త్రో ఈవెంట్లలో రజత, కాంస్య పతకాలతో సహా పది పతకాలను గెలుచుకుంది.

టీమ్ ఈవెంట్లలో (బృందంగా పాల్గొనే పోటీలలో), గీతం పురుషుల, మహిళల జట్లు టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, మిక్స్ డ్ డబుల్స్ పికిల్ బాల్ లలో రజత పతకాలను సాధించాయి. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మరాబోయే పోటీలలో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించి, అత్యుత్తమ ప్రదర్శన కనబరచాలంటూ వారిని ప్రోత్సహించారు.



# పటాన్చెరులో ఘనంగా ప్రారంభమైన ఎస్జిఎఫ్ మండల స్థాయి పోటీలు..

**- లాంచనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్**

పటాన్ చెరు, సెప్టెంబర్ 29, (స్పందన):



విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా సహకారం అందిస్తే భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పటాన్చెరువు మండల స్థాయి క్రీడోత్సవాలను.. ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థులకు క్రీడల పై ఆసక్తి పెంపొందించేలా నిరంతరం ఉచిత శిక్షణ, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో జాతీయస్థాయి పోటీలకు సైతం అతిథ్యం అందించబోతున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరగనున్న క్రీడోత్సవాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, కుమార్ గౌడ్, శివారెడ్డి, వెంకటేష్, అశోక్, శంకర్, రాజు, రాజన్ సింగ్, వివిధ పాఠశాల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగులో నాణ్యమైన మొక్కల ఉత్పత్తికి ప్రాధాన్యత ఇవ్వాలి..







## నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి...

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

జహీరాబాద్ సెప్టెంబర్ 29(స్పందన)

జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్స హించడంతో పాటు రైతులకు నాణ్యమైన మొక్కలు అందించేందుకు నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ సాగులో నాణ్యమైన మొక్కలు శాస్త్రీయ పద్ధతుల్లో పెంపకం, సరైన నీటి యాజమాన్యం కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు ఆయిల్ పామ్ మొక్కకు రూ.193 చొప్పున రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఝరాసంగం మండలం పోటిపల్లి గ్రామంలో గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆయిల్ పామ్ నర్సరీని జిల్లా కలెక్టర్ సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకం నిర్వహణ నీటి యాజమాన్యం మొక్కల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నర్సరీలలో మొక్కల పెంపకానికి నిర్దేశించిన ప్రమాణాలు నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం మొక్కల ఆరోగ్యం తదితర అంశాలను ఉద్యాన శాఖ అధికారులు ఎప్పటి కప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. రైతులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన మొక్కలు మాత్రమే అందేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫ పి ఓ)కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్షించారు. రైతులు, ఫ పి ఓ లను మరింత బలోపేతం చేయడంతో పాటు పంటల నిల్వ, మార్కెటింగ్ సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రెండు ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ద్వారా సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ స్థలంలో కోల్డ్ స్టోరేజ్ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా రైతులకు, ఫ్ ఫ్ పి ఓలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు అధికారులు నర్సరీ వివరాలను కలెక్టర్కు తెలియజేసారు. 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ నర్సరీలో సుమారు 3 లక్షల ఆయిల్ పామ్ మొక్కల ఉత్పత్తి సామర్థ్యం ఉందని తెలిపారు. నర్సరీ ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా రూ.35,36,154 సబ్సిడీ అందించినట్లు వివరించారు. ఆయిల్ పామ్లో ప్రైమరీ, సెకండరీ నర్సరీల నిర్వహణ ఎంతో కీలకమని, ప్రైమరీ నర్సరీలో మొక్కలను సుమారు 90 రోజుల పాటు పెంచి అనంతరం సెకండరీ నర్సరీకి తరలిస్తారని, ప్రస్తుతం ప్రైమరీ నర్సరీలో సుమారు 1.47 లక్షల మొక్కలు ఉన్నట్లు వివరించారు. సెకండరీ నర్సరీలో రైతులకు పంపిణీ చేసే వరకు సుమారు 9 నెలల పాటు మొక్కలను పెంచుతారని, ప్రస్తుతం అక్కడ 2.70 లక్షల మొక్కలు ఉన్నట్లు తెలిపారు. రైతులకు పంపిణీ చేసే సమయంలో ఆయిల్ పామ్ మొక్కలు 10--12 నెలల వయస్సు, సుమారు 1--1.2 మీటర్ల ఎత్తు, 20--25 సెం.మీ. కాండం చుట్టుకొలత (గిర్త్), 10--12 ఆరోగ్యకరమైన ఆకులు కలిగి ఉండేలా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సోమేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. సోమేశ్వర్ రావు, ఉద్యాన అధికారులు పండారి, కె. సునీత , అదనపు వ్యవసాయ అధికారి వైద్యనాథ్, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, శైలజ, కేవీకే శాస్త్రవేత్త, గోద్రెజ్ అగ్రోవేట్ నర్సరీ మేనేజర్ ప్రవీణ్ కుమార్, ఏజీఎం ఈశ్వర్ రెడ్డి, హెచ్ఈఓ సతీష్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయండి..

**- విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రత్యేక చర్యలు..**

**- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

పటాన్ చెరు, సెప్టెంబర్ 29, (స్పందన):



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల క్షేత్రస్థాయిలో తెలుసుకుంటూ.. ఇందుకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో.. వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు సర్కిల్, అమీన్ పూర్ సర్కిల్, పరిధిలోని ఆయా డివిజన్లలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎల్నినో ప్రభావంతో తాగినీటి సమస్యలు తలెత్తకుండా.. అవసరమైన చోట్ల నూతన బోర్లు వేయాలని ఆదేశించారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా పారిశుద్ధ్య విభాగానికి స్వీపింగ్ మెషీన్లు, టిప్పర్లు కొనుగోలు చేయడం జరిగిందని. వారానికి ఒకసారి ప్రజలు ప్రజా ప్రతినిధులు అధికారులతో కలిసి ప్రత్యేక సానిటేషన్ డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. తాను సైతం పాల్గొంటానని తెలిపారు. ప్రజల నుండి వీధి దీపాల అంశంపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే జీఎంఆర్ అధికారులకు తెలిపారు. వెంటనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పటాన్ చెరు డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, అమీన్ పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, డిఈలు కృష్ణవేణి, వెంకటరమణ, చరణ్ సింగ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గడ్డపోతారం మున్సిపాలిటీలో కౌన్సిలర్ల తిరుగుబాటు!





**- 42 తీర్మానాలకు మూకుమ్మడి నో..**

**- చైర్మన్, కమిషనర్ తీరుపై తీవ్ర అసంతృప్తి**

జిన్నారం, సెప్టెంబర్ 29 (స్పందన):

గడ్డపోతారం మున్సిపాలిటీలో పాలకవర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన 42 తీర్మానాలను మెజార్టీ కౌన్సిలర్లు వ్యతిరేకించడంతో సమావేశం వాడీవేడిగా మారింది. ప్రతి అంశంపై ముందుగా కౌన్సిలర్లతో చర్చించిన అనంతరం మాత్రమే తీర్మానాలను ఆమోదించాలని వారు పట్టుబట్టారు. తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా పలు అంశాలను తీర్మానాల రూపంలో సమావేశంలో ప్రవేశపెట్టడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ సుష్మ గణేష్, కమిషనర్ తాన్య వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వారు.. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ఇతర కీలక అంశాలపై ముందస్తుగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. 42 తీర్మానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సమావేశాన్ని రద్దు చేసి, నిబంధనల ప్రకారం తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహించాలని మెజార్టీ కౌన్సిలర్లు కోరారు.

ఈ మేరకు కమిషనర్ తాన్యకు వినతిపత్రం అందజేసి, తిరిగి సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఇదిలా ఉండగా.. మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ, మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని కౌన్సిలర్లు ఆరోపించారు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 42 తీర్మానాలపై కౌన్సిలర్లు మూకుమ్మడిగా అభ్యంతరం వ్యక్తం చేయడం గడ్డపోతారం మున్సిపాలిటీ పాలకవర్గంలో నెలకొన్న అంతర్గత విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చింది.

# జహీరాబాద్లో ఉద్రిక్తత

**పోలీసుల వేధింపులతోనే బి ఆర్ ఎస్ కార్యకర్త శేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడని బంధువుల ఆరోపణ**

**న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయింపు.. ఆందోళనకు మద్దతుగా ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు**

జహీరాబాద్, సెప్టెంబర్ 29(స్పందన)



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం బిలాల్పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గూళ్ల శేఖర్ ఆత్మహత్య ఘటన జహీరాబాద్లో ఉద్రిక్తతకు దారితీసింది. ఓ బంగారు ఆభరణాల చోరీ కేసు విచారణలో భాగంగా పోలీసులు శేఖర్ను అదుపులోకి తీసుకున్నారని, విచారణ పేరుతో పోలీసులు కొట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. శేఖర్ మృతితో బిలాల్పూర్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల వేధింపులపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు జహీరాబాద్లో ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆందోళనకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్రావు పాల్గొన్నారు. శేఖర్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. "అధికార మదంతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారు" ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ.. మాణిక్ రావు మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. "అధికారం ఎవరికీ శాశ్వతం కాదు.. పోలీసులు అతిగా వ్యవహరించడం మంచిది కాదు. శేఖర్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం" అని అన్నారు. శేఖర్ మృతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.




## ప్రభాస్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటిస్తున్న 'ఫౌజీ' విడుదల వాయిదా పడటంతో.. ఇప్పుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్' ముందుగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలపై టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. 'ఫౌజీ' డిసెంబరు 3, 2026న విడుదల కావాల్సి ఉండగా.. తాజాగా ఆ తేదీ నుంచి వాయిదా పడినట్లు నిర్మాతలు ప్రకటించారు. కొత్త విడుదల తేదీని ఇంకా వెల్లడించలేదు.

## డింపుల్ హాయతి డెడికేషన్

విక్టరీ వెంకటేశ్ హీరోగా తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం'పై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్ర ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. తాజాగా విడుదలైన 'నారాయణమ్మ' పాటలో నటి డింపుల్ హాయతి డ్యాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండగా.. ఈ పాట కోసం ఆమె చూపిన అంకితభావంపై దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. 'నారాయణమ్మ' జానపద శైలిలో సాగే ఉత్సాహభరితమైన గీతంగా రూపొందింది. ఇందులో డింపుల్ హాయతి తన నృత్యంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పాట చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గకుండా.. సన్నివేశాలు, నృత్య భంగిమలు పర్ఫెక్ట్‌గా వచ్చే వరకు ఆమె రిహార్సల్స్ చేసినట్లు చిత్రబృందం తెలిపింది. పాట విడుదల కార్యక్రమంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ డింపుల్ హాయతి అంకితభావాన్ని ప్రశంసించారు. ఓ నటిగా పాత్రకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో ఆమె చూపిన కష్టం తెలియజేస్తోందని అభినందించినట్లు సమాచారం. డింపుల్ నృత్యం, తెరపై ఆమె చూపించిన ఉత్సాహాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు.

**సినిమాలోనూ అవకాశం?**

డింపుల్ హాయతిని కేవలం ప్రత్యేక గీతాల్లో కాకుండా సినిమాల్లోనూ చూడాలని ఉందంటూ త్రివిక్రమ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తిని పెంచాయి. దీంతో భవిష్యత్తులో తన దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో డింపుల్‌కు అవకాశం దక్కవచ్చనే చర్చ మొదలైంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.





## 16 ఏళ్లకే ఇంటి నుంచి బయటకు.. శోభిత ఆసక్తికర వ్యాఖ్యలు

అక్కినేని కోడలు, నటి శోభిత ధూళిపాళ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విష యాల ను వెల్లడించారు. తెనాలికి చెందిన ఆమె తెలుగు సినిమాలతో పాటు హిందీ చిత్రాలు, వెబ్ సిరీస్ లలో నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకు న్నారు. నాగచైతన్యతో ప్రేమ, అనం తరం వివాహంతో తెలుగు ప్రేక్షకు లకు మరింత చేరువయ్యారు. తాజా గా ఓ ఇంట ర్వ్యూలో తన చిన్ననాటి నిర్ణయా లు, సినీ రంగంలోకి వచ్చిన విధానం గురించి ఆమె మాట్లాడా రు. 16 ఏళ్లకే వైజాగ్ నుంచి రైలు ప్రయాణం తనకు 16 ఏళ్ల వయసు ఉ న్నప్పుడే వైజాగ్ నుంచి బ్యాగ్ సర్దుకుని కోనార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కినట్లు శోభిత తెలిపారు. భవిష్య త్తులో ఏం జరుగుతుందో స్పష్టంగా తెలియకపోయినా.. జీవి తంలో ఎదురయ్యే పరిస్థి తులను ధైర్యంగా ఎదుర్కోవాలని అప్పుడే నిర్ణయించు కున్నానని చెప్పారు. మోడలింగ్, నటనపై ఉన్న ఆసక్తి తో చిన్న వయ సులోనే సొంత ఊరి ని వదిలి కొత్త ప్రయాణాన్ని ప్రారం భించినట్లు తెలిపారు.



తల్లిగా మారిన తర్వాత ఎదురైన అనుభవాల గురించి బాలీవుడ్ నటి పరిణీతి చోప్రా ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తన కుమారుడు నీర్‌ను ఇంట్లో వదిలి తొలిసారి పని కోసం ప్రయాణించినప్పుడు తీవ్ర అపరాధ భావనకు గురయ్యానని తెలిపారు. ప్రసవం తర్వాత చాలా నెలల పాటు కుమారుడితోనే ఉన్నానని పరిణీతి చెప్పారు. తొలిసారి బిడ్డకు దూరంగా ప్రయాణిస్తున్న సమయంలో విమానంలో దాదాపు మూడు గంటల పాటు ఏడుస్తూనే ఉన్నానని వెల్లడించారు.

## 'ధర్మన్'లో రామ్ పోతినేని..

సూపర్‌స్టార్ రజినీకాంత్, టాలీవుడ్ హీరో రామ్ పోతినేని అభిమానులను ఆకట్టుకునే వార్త ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. రజినీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న 'ధర్మన్'లో రామ్ పోతినేని కూడా నటిస్తున్నారనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. ఇప్పటివరకు దీనిపై అధికారిక ప్రకటన లేకపోయినా.. తాజాగా హీరోయిన్ రాశీ ఖన్నా పంచుకున్న ఓ ఫొటో ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. 'ధర్మన్' మైసూర్ షెడ్యూల్‌కు సంబంధించిన కొన్ని ఫొటోలను రాశీ ఖన్నా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అందులో రజినీకాంత్, రాశీ ఖన్నాతో పాటు రామ్ పోతినేని కూడా కనిపించారు. అయితే ఆ ఫొటోను కొద్దిసేపటికే తొలగించినట్లు తెలుస్తోంది.



Printed, Published, Owned by Md Nazeer Ahmed, Published from 5-8-124/231, Narayana Reddy colony, Sangareddy, Telangana 502001 Printed At Saketh Printers SY. No. 212, Trinetra Complex, Veerabadra Nagar, Sangareddy, Telangana 502001,RNI NO TGTEL26/A6780